www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 జులై 2023

5

కాకినాడ

నేడు యథావిధిగా స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం, జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి యథావిధిగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిగురిస్తున్న ఖరీఫ్ ఆశలు

- వర్షాలతో ఆకుమడులకు ఊపిరి
- విత్తనాలు చల్లడానికి రైతులు సిద్ధం
- చిరు ధాన్యాలు, అపరాల పంటలకు దోహదం

పిఠాపురంలో రైతులు సిద్ధం చేసిన పొలాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే వరి విత్తనాలు వేసిన ఆకు మడులకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని అన్నదాతలు అంటున్నారు. ఇంతవరకు వరి ఆకుమడులు పోయని రైతులు, విత్తనాలు చల్లడానికి సన్నద్ధం అయ్యారు. రానున్న వారం పది రోజుల్లో భారీ వర్షాలు కురిసి చెరువులు, రిజర్వాయర్లలో నీరు చేరి, నదుల్లో వరద ప్రవాహనం పెరిగితే ఖరీఫ్ వరి సాగుకు డోకా ఉండదని రైతులు అంటున్నారు.

పసిఫిక్ మహాసముద్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా వర్షాలు సాధారణం కన్నా తక్కువ కురుస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఈ మాదిరిగానే గత రెండు నెలల నుంచి జిల్లాలో వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండలు తీక్షణంగా కాయడం, నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం, అవి కూడా బలహీనంగా పండడంతో జూన్‌లో సాధారణ వర్షపాతంలో సగమే కురిసింది, జూలై మొదటి వారంలో కూడా ఇవే పరిస్థితులు కొనసాగడంతో ఖరీఫ్ సాగుపై నీలినీడలు అలముకున్నాయి. వరి నాట్లు వేసే సమయం దగ్గరపడుతున్నప్పటికీ ఇంకా నారుమడుల్లో విత్తనాలు చల్లలేని పరిస్థితి నెలకొంది. గత నెలాఖరులో చెదురుమదురుగా కురిసిన వర్షాలతో కొంతమంది రైతులు నారుమడుల్లో వరి విత్తనాలు చల్లారు. మొలకలు వచ్చినప్పటికీ తరువాత వర్షాలు మొహం చాటేశాయి. దీంతో నారు మొక్కలు ఎండి పోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. మిగిలిన రైతులు విత్తనాలు చల్లడానికి వెనుకంజ వేశారు. ఇటువంటి తరుణంలో మూడు. రోజుల నుంచి వాతావరణం మారిపోయి వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఆకు మడులకు ఈ వర్షం ఊపిరిపోయగా, మిగిలిన రైతులు మడులు సిద్ధం చేసుకొని విత్తనాలు చల్లుతున్నారు. పిఠాపురం, సామర్లకోట, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు దఫదఫాలుగా భారీ వర్షం పడడంతో పొలాల్లో నీరు చేరింది. ఇప్పటికే వేసిన చిరుధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయలు, నూనెగింజల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

ప్రజాశక్తి-కాకినాడ

మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని ఓడించడానికి కృషి విస్తృత వేదికల ద్వారా కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారామ్ పిలుపు ఇచ్చారు. సిపిఎం జిల్లా శాఖ కార్యదర్శుల శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ తరగతుల్లో ఆదివారం సీతారామ్ మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ వనరులను దోచిపెడుతున్నారని, ఈ విధానాలను వ్యతిరేకించే పార్టీలు, సంస్థలపై కేంద్ర సంస్థలు ప్రయోగించి కేసులు పెడుతున్నారని, ప్రతిపక్షం లేకుండా పాలన సాగించాలని, రెండు పార్టీల వ్యవస్థ తీసుకొచ్చి ప్రాంతీయ పార్టీలను అణగదొక్కే బిజెపి కుట్రలు రాష్టంలోని పాలక, ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకంచకుండా మౌనంగా ఉండడం దేనికి సంకేతం అని సీతారామ్ ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం మణిపూర్‌లో గిరిజనులు, మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా అల్లర్లు ఆపే ప్రయత్నం చేయకుండా నిమ్మకు నీరేతినట్టు వ్యవహరించడం వెనుక గిరిజన ప్రాంతంలోని మైనింగ్, భూములు కాజేసే కుట్రలు ఉన్నాయనాన్రు. 25న దేశవ్యాప్త నిరసనలో విశాల ప్రజావేదికలను కలుపుకుని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డి.శేషబాబ్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ క్లాసుల్లో కెఎస్.శ్రీనివాస్, కె.ప్రసాద్, ఎన్.సూరిబాబు, పి.వీరబాబు, రమణి, టి.ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల రక్షణే ధ్యేయం : డిఐజి

అవుట్ పోస్ట్ ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ, డిఐజి

ప్రజాశక్తి-రౌతులపూడి

శాంతి భద్రతలు కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏలూరు రేంజ్ డిఐజి జి.అశోక్ కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో నూతన అవుట్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం కాకినాడ ఎంపీ వంగా గీత విశ్వనాథ్, ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డిజిపి రాజేంద్రనాథ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, గంజాయి రవాణా, మత్తు పదార్థాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. యువత మత్తు పదార్థాలు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రౌతులపూడి కేంద్రంగా అవుట్ పోలీస్ స్టేషన్ ప్రారంభించడంతో 26 గ్రామాల ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. న్యాయపరమైన ఇబ్బందులు తొందరలోనే పరిష్కారమై రౌతులపూడి కేంద్రంగా పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి సతీష్ కుమార్, ఎఎస్‌పి పి.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, డిఎస్‌పి లతా కుమారి, ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రమణమ్మ, డిసిసిబి డైరెక్టర్ మధు, సర్పంచ్ అర్జమ్మ, ఎస్ఐ అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మిళితమైన ప్రసార సాధనాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రేడియో, దూరదర్శన్ ప్రజల జీవితాలలో ఒక ముఖ్యమైన భాగంగా మిళితమయ్యాయని న్యాయ వాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ప్రసార దినోత్సవం ఆదివారం నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడారు. 1927 జూలై 23న దేశంలో మొట్ట మొదటిసారిగా బొంబాయి స్టేషన్ నుంచి రేడియో ప్రసారాలు ప్రారంభమవడంతో అప్పటి నుండి ఈ రోజున జాతీయ ప్రసార దినోత్సవంగా జరుపు కుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రాజా పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

విజేతలతో యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేట లోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఫ్యూచర్ స్టార్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముగింపు సభలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందుతుందన్నారు. సెక్రటరీ కె.మోహన్ బాబు మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఎక్కువ మంది క్రీడాకారులతో క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. విజేతలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, రామసీత, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, చీఫ్ రిఫరీ రమణ కుమార్, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ పి.వేణుగోపాల్, బాల దుర్గారావు పాల్గొన్నారు.

లై డిటెక్టర్‌తో చర్చకు సిద్ధం : దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప చేసిన ఆరోపణలకు తాను పెద్దాపురం మున్సిపల్ సెంటర్లో లై డిటెక్టర్‌తో చర్చకు సిద్ధమని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు సవాల్ విసిరారు. ఆదివారం సామర్లకోట వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో పెద్దాపురం నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని చెబుతున్నారని, అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ కనిపిస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చినరాజప్ప నియోజవర్గంలో ఉన్న కొండలను తరలించి రూ.కోట్లు సంపాదించారని, అభివృద్ధి పనుల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని దొరబాబు ఆరోపించారు. దీనిపై ఈ నెల 31న పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో చర్చకు తాను సిద్ధమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తల్లిదండ్రులను గౌరవించడం, ఆదరించడం అనాదిగా ఒక సహజ సూత్రంగా ఇమిడి ఉందని ఆధ్యాత్మికవేత్త చంద్రరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ తల్లిదండ్రుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ప్రేమను ప్రపంచంలో ఎవరూ భర్తీ చేయలేరన్నారు. పిల్లలు ఎంత ఎత్తుకు ఎదిగినా ఆ వెనుక తల్లిదండ్రుల నిరంతర శ్రమ ఉంటుందన్నారు. పిల్లలకు ఎంత వయసు వచ్చినా తల్లిదండ్రులకు చిన్నపిల్లలాగానే కనిపిస్తారన్నారు. అలాంటి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1906 జూలై 23న ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన ఆజాద్ భారత స్వాతంత్ర పోరాటంలో యువకుల తెగువను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. నాయకునిలా కాక ఒక సేవకుడిలా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. స్వాతంత్రం అంటే ఆత్మ గౌరవం అని నిరూపించారని అన్నారు. 25వ ఏటనే ఆత్మ త్యాగం చేసిన ఆజాద్ దేశభక్తి ఎనలేనిదని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీ నగేష్, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

లోకమాన్య తిలక్ నిత్య స్మరణీయుడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్వాతంత్రం నా జన్మ హక్కు అని చాటిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ నిత్యస్మరణీయులని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అసమాన ప్రజ్ఞాపాటవాలతో బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహోన్నత వ్యక్తి తిలక్ అని కొనియాడారు. మహారాష్ట్రలో జన్మించిన ఆయన స్వాతంత్ర ఉద్యమంపై పత్రిక ప్రారంభించి స్వాతంత్రం గురించి విస్తత ప్రచారం చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆరేళ్లపాటు దేశ బహిష్కరణ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

సంఘ సేవిక కెప్టెన్ లక్ష్మీ సెహగల్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్వాతంత్ర సమరయోధురాలు, వైద్యురాలు కెప్టెన్ లక్ష్మీ సెహగల్ ప్రముఖ సంఘ సేవకురాలిగా దేశ ప్రజలకు విశేష సేవలందించారని వాకర్స్ జిల్లా కోఆర్డినేటర్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ కాలంలో సుభాష్ చంద్రబోస్ ఆదేశం మేరకు మహిళా రిజిమెంట్ ను ఏర్పాటు చేశారని అన్నారు. దీంతో ఆమె కెప్టెన్ లక్ష్మీగా మారారని తెలిపారు. ఈ పేరు ఆమెకు జీవితాంతం గుర్తింపునిచ్చిందన్నారు. 1945లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను అరెస్టు చేసి బర్మాకు తరలించినట్టు చెప్పారు. బంగ్లాదేశ్ శరణార్థుల కోసం ఆమె కలకత్తాలో సహాయ శిబిరాలను, వైద్య సహాయాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజా, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

టిడిపితో బిసిలకు సంక్షేమం, రక్షణ

గ్రామస్తులతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బిసిలకు తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం, రక్షణ సాధ్యమని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని 42వ డివిజన్ టీచర్స్ కాలనీలో భవిష్యత్తు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో ప్రచారంలో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి - మీ అనంతలక్ష్మి' 19వ రోజు కార్యక్రమం రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి నేతత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్ పాలనలో వేలాది మంది బిసిలు అణచివేతకు, దాడులకు గురయ్యారన్నారు. బిసి సబ్‌ప్లాన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. నిధులులేని కార్పొరేషన్లతో సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. టిడిపి మహానాడు వేదికగా ప్రకటించిన మేనిఫెస్టోతో బిసిలకు అధిక ప్రయోజనం కలగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కర్రి వెంకటరాజు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రకాష్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టా రాము, ఎలాగా లోవరాజు, బత్తి రాంబాబు, బి.భద్రరావు, దల్లి ముసలి రెడ్డి, కొర్ని ఆంజనేయులు, మిరపల సూర్య ప్రకాష్, బొజ్జ భవాని సాంబశివరావు, పలివెల గాయత్రి, కొమిరిశెట్టి నర్సింగరావు, పెంకే వీరబాబు, సూరంపూడి రాజు, దొమ్మేటి వెంకటరమణ, పెమ్మాడి శ్రీను, గంటా రమణ, కాళా శ్రీను, సిహెచ్.సాయిబాబా చౌదరి, పడమటి వీరబాబు, చల్మాజీ, పిల్లి విజయగోపాల్, వాసంశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రాజాపూడి గ్రామం సగర పేటకు చెందిన పలువురు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ వైసిపి నుండి ఇంత పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలోకి రావడం చాలా ఆనందదాయకమన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజల అభివద్ధి, సంక్షేమం అందరికీ అందుతుందన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ మహానాడు వేదికగా అనేక సంక్షేమ పథకాల రూపకల్పన చేశారన్నారు. గతంలో రాజపుడిలో రూ.కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు వేశామని, ఈ ఎంఎల్ఎ, ఈ ప్రభుత్వం గానీ ఎక్కడైనా రోడ్లు వేశారా, ఆఖరికి ఒక్క డ్రైన్ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం గ్రామంలో డ్రైనేజీలు అన్నీ పూర్తి చేస్తానన్నారు. జిల్లాలో సగర సోదరులందరికీ జగ్గంపేట కేంద్రంగా కమ్యూనిటీ భవన నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, పైడిపాల సూరిబాబు, పాలచర్ల సత్యనారాయణ, పోట్రు కృష్ణ, మంగన నారాయణరావు, మంగన శ్రీను, లోవరాజు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసనలు

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానవీయ సంఘటనల పట్ల పలుచోట్ల ఆదివారం ఆందోళనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడలో..

కాకినాడలో సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తిరాజు అధ్వర్యంలో రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సెంటర్ సభ్యులు ఎపిఎస్‌పి నుంచి సర్పవరం జంక్షన్ వరకూ పెద్దఎత్తున ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మూర్తి రాజు మాట్లాడుతూ మన దేశాన్ని కాపాడే సైనికుడి భార్యకే రక్షణ లేకపోతే సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సివైఎఫ్ స్టేట్ కో ఆర్డినేటర్ జంగా గగారిన్ చౌదరి, జిల్లా కో ఆర్డినేటర్ జిమ్ విల్సన్, అబ్రహాం రెడ్డి, వల్లూరి నానాజీ, మధు సూదన్ రావు, వారా వినోద్ తదితరులు పాల్గొన్నారు. **అన్నవరంలో** దళిత క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

అన్నవరంలో..

ఈ సందర్భంగా క్రైస్తవ ముస్లిం సంఘాల నాయకులు మాట్లాడుతూ మైనార్టీలపై హింసాత్మక దాడుల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. **జగ్గంపేట రూరల్‌లో** సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కాకినాడ జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి రాజు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులాపల్లి అచ్చారావు, రమణ, రొబ్బల సంకురమ్మ, ఇమ్మిడి లక్ష్మి, గుమ్మడి నూకరత్నం పాల్గొన్నారు.

న్యాయం కోసం ఎంపిపి రాజ్యలక్ష్మి వేడుకోలు

ప్రజాశక్తి-అన్నవరం, రౌతులపూడి

రౌతులపూడి ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి తనకు పోలీస్ స్టేషన్లో కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాలతో అధికారులు తనకు ప్రొటోకాల్ అమలు చేయడం లేదని ప్రకటించడంతో ఎంఎల్ఎ తనపై కక్ష పెంచుకొని ఇటీవల తన అనుచరులతో తన ఇంటి పైకి వచ్చి దుర్భాషలాడి దాడి చేశారన్నారు. ఈ సంఘటనపై నేటి వరకు న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రౌతులపూడి పోలీసు అవుట్ పోస్ట్ ప్రారంభం సందర్భంగా వచ్చిన ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్‌కు తన గోడు చెప్పుకునేందుకు వెళ్ళగా అక్కడ కూడా వెళ్లేందుకు అనుమతించలేదన్నారు. డిఐజి బయటకు వచ్చేటప్పుడు కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందిస్తే అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలన్నారని, అక్కడికి వెళితే పోలీసులు స్పందనకు వెళ్లాలని చెప్పారన్నారు. తాను గిరిజన మహిళ కావడంతోనే ఎక్కడా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పిఠాపురం రూరల్ ఎస్ఐగా గుణశేఖర్

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎల్.గుణశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పని చేసిన ఎస్ఐ అబ్దుల్ నబీ రౌతులపూడిలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. గుణశేఖర్ కాకినాడ వన్ టౌన్ ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతలు విఘాతం లేకుండా, అసాంఘిక కార్యక్రమాలు నివారణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మ్యూజిగల్ సంగీత అకాడమీ ప్రారంభం

అకాడమీని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో స్థానిక నాగమల్లితోట జంక్షన్, సత్యకళావాహిని ఎదురుగా ఏర్పాటు చేసిన మ్యూజిగల్ సంగీత అకాడమీ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. మ్యూజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రముఖ గాయకుడు కొండేపూడి యశస్వి అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడలో సంగీత ప్రియుల కోసం అకాడమీ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన కాకినాడ నగరాన్ని సంగీత పరంగా కూడా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు ఇటువంటి అకాడమీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వ్యాపార పరంగా ఎంతో అభివద్ధి సాధించిన, వాడకట్టు కిషోర్, పద్మజ దంపతులు సంగీత రంగంలో కూడా మంచి వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మంచి వాతావరణంలో అన్ని రకాల వాయిద్య పరికరాలు ఏర్పాటు చేసి, నిష్ణాతులైన టీచర్లతో ఏర్పాటు చేసిన అకాడమీని కాకినాడ మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మ్యుజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అకాడమీ నిర్వాహకురాలు పద్మజ మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో పెరిగిపోతున్న ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఒక మంచి వైద్యం సంగీతం అన్నారు. అటువంటి సంగీతాన్ని అందరికీ చేరువ చేయాలనే ఉద్దేశంతో అకాడమీని ప్రారంభించినట్టు చెప్పారు. తమ అకాడమీలో పియానో, కీబోర్డ్, గిటార్, డ్రమ్స్, శాస్త్రీయ, పాశ్చాత్య సంగీతంలో విస్తత శ్రేణి కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్‌విఎస్.రావు, గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పెద్ది రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నగదు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొత్తపేట

స్థానిక గణేష్ నగర్‌లో చోరీ జరిగినట్లు కొత్తపేట ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. బూల వినయ్‌కొత్తపేట మెయిన్ రోడ్డులో బిర్యానీ పాయింట్ నడుపుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం రాజమహేంద్రవరం పనికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి వెనుకవైపు ఉన్న తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా దాచుకున్న సుమారు రూ.30 వేలు కనిపించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే సంఘటనా స్థలానికి రావులపాలెం సిఐ రజనీకుమార్, ఎస్ఐ మణికుమార్ వెళ్లి పరిశీలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సముద్రంలో స్నానానికి దిగి బాలుడు గల్లంతు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మండలంలోని పి.వేమవరం గ్రామానికి చెందిన బాలుడు యు.కొత్తపల్లిలో సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతవడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. మండలంలోని పి.వేమవరం గ్రామానికి చెందిన పసుపులేటి ప్రభాకర్ రావు, సుజాత తమ కుమారుడు పార్థుతో కలిసి తలుపులమ్మ లోవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోనపాపపేట వద్ద కుటుంబికులతో సముద్ర స్నానం చేస్తుండగా పార్థు గల్లంతయ్యాడు. పిఠాపురం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘటన స్థలంలో గాలింపు చర్యలు ప్రారంభించారు.

కుమారుని మృతదేహం కోసం తల్లి ఎదురుచూపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

దేశం కాని దేశంలో చనిపోయిన తన కుమారుడి మతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు కషి చేయాలంటూ కన్న తల్లి వేడుకుంటోంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లపల్లి పంచాయితీ బొండాడిపేటకు చెందిన పొలమూరి వరలక్ష్మి కుమారుడు సంజీవరావు (32) ఉపాధి నిమిత్తం బ్రైన్‌లో ఉన్నాడు. వీసా వచ్చిన చోట పని ముగియడంతో కొంతకాలంగా అక్కడే స్నేహితులతో కలిసి పనికి వెళుతున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కాని తాను ఉంటున్న చోట సంజీవరావు ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, మృతదేహం ఆసుపత్రిలో ఉందని అక్కడి బంధువులు వరలక్ష్మికి శుక్రవారం ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సంజీవరావు తండ్రి ప్రకాశరావు ఏడాది క్రితం మృతి చెందారు. అద్దె ఇంటిలో ఉంటున్న తనకు, ఆర్థిక స్తోమత లేదని,ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, నాయకులు కలుగజేసుకుని తన కుమారుడు మతదేహాన్ని ఇక్కడకు తీసుకు రావాలని వరలక్ష్మి దీనంగా కోరుకుంటోంది.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -కరప

కరప సహకార పరపతి సంఘంలో ఇన్‌ఛార్జి సిఇఒగా పనిచేస్తున్న కరప గ్రామానికి చెందిన చోడపునీడి మంగతాయారు (34) ఇటీవల ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకవడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. మంగతాయారు వికలాంగురాలు కావడంతో ప్రమాదం నుంచి బయటపడే అవకాశం లేక మంటల్లో చిక్కుకోవడంతో కేకలు వేయడంతో స్థానికులు ఆమెని బయటకు తీసుకుని వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు మూడేళ్లు, ఒక సంవత్సరం పిల్లలు ఉన్నారు. వారి బాధ్యత ఆమెదే కావడంతో ఇద్దరు పిల్లలు అనాథలవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మద్యానికి బానిసై ముగ్గురిపై దాడి

ప్రజాశక్తి-గోపాలపురం

మద్యానికి బానిసైన వ్యక్తి తన భార్యను, అత్తను, బావమరిదిని కొట్టి గాయపరచిన సంఘటన మండలంలోని కరగపాడు పంచాయతీ పరిధిలోని బుచ్చిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుని తండ్రి బొమ్మిన లక్ష్మణరావు విలేకరులతో మాట్లాడారు. కరగపాడు పంచాయతీ పరిధిలోని బుచ్చిపాలెంకు చెందిన వాసుబోయిన చిన రాంబాబుకు తన కుమార్తె దుర్గను ఇచ్చి వివాహం చేసినట్లు తెలిపారు. తన అల్లుడు తన కుమార్తె దుర్గను తీవ్రంగా గాయపరచాడని తెలిపారు. ఆమెను కొయ్యలగూడెంలో ఆసుపత్రిలో చూపించారన్నారు. ఆదివారం తన కుమార్తెను చూసేందుకు తన భార్య కుమారి వెళ్ళగా ఆమెపైనా దాడి చేశాడన్నారు. అనంతరం తన కుమారుడు వెంకన్న వెళ్ళగా కర్రతో తల మీద కొట్టడంతో తీవ్రంగా గాయపడినట్టు చెప్పారు. వారిద్దరినీ ప్రభుత్వాసుపత్రిలో చేర్చినట్టు చెప్పారు. గోపాలపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరపాడు గ్రామంలోని పుంత రోడ్డులో కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.మూడు వేల నగదు, 10 మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

టిడిపి ఎంబిసి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా పెండ్ర

ప్రజాశక్తి-అయినవిల్లి

టిడిపి ఎంబిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా విలస గ్రామానికి చెందిన ఫ్రెండ ప్రభ ఎన్నికయ్యారు. ఎంబిసి కన్వీనర్ వాడపల్లి ప్రసాద్ కమిటీ సభ్యులు పూలమాలలతో అతని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంబిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పెండ్ర రమేష్, రాష్ట్ర సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వేట్లపాలెంలో రామకృష్ణ సేవా సమితి ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న ట్యుటోరియల్‌కు సీ పోర్ట్ లిమిటెడ్ సిఇఒ మెర్ల మురళీధర్ ఏడు కొత్త కంప్యూటర్లతో పాటు బ్యాక్‌అప్ బ్యాటరీలను అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు సీపోర్ట్ సిఇఒకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన పరిశ్రమకు ప్రోత్సాహకాలు



ఉద్యాన శాఖ జిల్లా అధికారి మల్లికార్జునరావు

ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉద్యాన పరిశ్రమలకు పలు ప్రోత్సకాహాలను అందిందని జిల్లా ఉద్యాన అధికారి నేతల మల్లికార్జునరావు తెలిపారు. అందిస్తున్న రాయితీలను రైతులు బాగా ఉపయోగించుకోవడంతో పాటు అధిక ఆదాయం ఆర్జించే పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉప ఉత్పత్తులు తయారు చేసుకుని గిట్టుబాటు ధర పొందాలన్నారు.

జిల్లాలో ఏయే ఉద్యాన పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి?

ఎక్కువగా కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్ పామ్, మామిడి, అరటి, కర్రపెండలం, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. కాకినాడ జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 30 వేల ఎకరాల్లో జీడి మామిడి, 28 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్, 20 వేల ఎకరాల్లో మామిడి, సుమారు 4 వేల ఎకరాల్లో అరటి, మిగిలిన విస్తీర్ణంలో దానిమ్మ, నిమ్మ, నారింజ, జామ, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి.

శీతల గిడ్డంగుల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నారా.?

రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 30 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షల యూనిట్ విలువలో రూ.11.25 లక్షలు వరకూ రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. ఈ యూనిట్లను నెలకొల్పుకునే రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలి.

ఆహార పదార్థాల శుద్ధికరణ యూనిట్లకు ఎటువంటి రాయితీలు ఇస్తున్నారు.?

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆహార పదార్థాల శుద్ధికరణ యూనిట్ల కోసం రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. రూ.30 లక్షల యూనిట్ విలువకు ప్రభుత్వం గరిష్టంగా 35 శాతం రాయితీలను ఇస్తుంది. యూనిట్ విలువలో 90 శాతం బ్యాంకు రుణాలు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సమీకత ఉద్యాన పంటల అభివద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

సమీకత ఉద్యాన పంటల అభివద్ధి పథకంలో భాగంగా మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ప్రభుత్వం అందజేస్తుంది. రూ.25 లక్షలు యూనిట్ విలువ ఉంటుంది. జీడిపిక్కలు ప్రాసెసింగ్, మామిడి తాండ్ర తయారీ తదితర పరిశ్రమలను ఈ పథకంలో భాగంగా నెలకొల్పుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా మరో 35 శాతం అదనంగా రాయితీ కల్పిస్తాం. జిల్లాలో 10 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఎస్సీ లబ్ధిదారులు కూడా అవకాశం ఉంది.

ఆధునిక సాగు పద్ధతులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు.?

ఆధునిక సాగు పద్ధతుల్లో భాగంగా ఉద్యాన శాఖ షెడ్ నెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. 35 శాతం సబ్సిడీతో పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు.

ఇ-పంట నమోదు తప్పనిసరి అంటున్నారు నిజమేనా.?

రైతుల పంటలకు ఇన్ ఫుట్ సబ్సిడీ రావాలన్నా, ఇన్సూరెన్స్ పొందాలన్నా, బ్యాంకుల నుంచి రుణాలు కావాలన్నా ఇలా ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందాలన్నా ఇ-పంట నమోదు తప్పనిసరి. జిల్లాలో 85 శాతం మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తదితర దీర్ఘకాలిక పంటలు, 15 శాతం కూరగాయలు, పసుపు, బొప్పాయి, పూలు, పండ్లు తదితర పంటలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమల నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తోంది. కోకోనట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా వ్యక్తులు, రైతులు, సంఘాలకు 35 శాతం రాయితీపై యూనిట్‌లను పెట్టుకునే అవకాశం ఉంది.

అంతర పంటల వల్ల ఉపయోగం ఏమిటి?

రైతులు అదనపు ఆదాయం పొందుటకు కొబ్బరి, ఆయిల్‌పామ్ తదితర పంటలలో కురగాయలు, అల్లం, పసుపు, కంద, కోకో, మిరియాలు వంటి పంటలను వేసుకోవచ్చు. వీటిని ఉద్యానశాఖ తరుపున రాయితీలో అందిస్తున్నాం.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి గ్రామంలో అభివద్ధి వేగవంతంగా జరిగేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణాభివృద్ధికి అందరూ కషి చేయాలన్నారు. ఎంపిపి సత్యవతి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలో మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు కృషి చేయాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయని, వీటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి మిర్యాల రాజా, ఎంపిడిఒ అశోక్ కుమార్, తహశీల్దారు జితేంద్ర, ఐసిడిఎస్ సిడిపిఒ ఉష, కాండ్రకోట పిహెచ్‌సి డాక్టర్ చంద్ర కిరణ్ బాబు, ఎపిఒ రాజబాబు, ఎంఇఒ ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా చివరి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావటంతో ఆలయ పరిసరాలన్నీ జనంతో కిటకిటలాడాయి. యాత్రికులు ఎటువంటి ఇబ్బందులక్షు పడకుండా ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.ఉ త్సవ కమిటీ సభ్యులు ముమ్మన వెంకట ప్రకాశం, బైలపూడి సత్యనారాయణ, దాకారపు కామరాజు, చల్లా సత్యనారాయణ, దాకమిల్లి రమేష్, చీపురుపల్లి అరుణ, బొండాడ అప్పలరాజు, ఆలయ సిబ్బంది యాత్రికులకు సేవలందించారు. ఎస్ఐ వి.సురేష్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాయం అందజేస్తున్న సభ్యులు

టెక్నీషియన్‌కు రూ.55 వేల సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మొబైల్ టెక్నీషియన్ ఎం.విజయ్ కుమార్‌కు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ తరపున ఆదివారం రూ.55 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన కోలుకునేంతవరకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.సురేష్‌బాబు, సిహెచ్.పాపారావు, బుజ్జి, కోశాధికారి ఇస్మాయిల్, నారాయణ, శేఖర్, నాని, రామకృష్ణ, రూప, శరత్, అడ్డూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

45 శాతం వరి నాట్లు పూర్తి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ఇప్పటికీ ఖరీఫ్ సీజన్‌కు 3,456 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారి సద్గురు మూర్తి తెలిపారు. ఇంకా 55 శాతం వరి పంట నాట్లు వేయాల్సి ఉందన్నారు. వరి నాట్లు వేసే రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. నారుమడిలో జింకు లోపం ఉంటే అనగా పసుపు పచ్చగా, ఆకులు పెలుసుగా ఉంటే 12 శాతం చిలేటెడ్, జింకు కేజి యూరియాతో కలిపి పిచికారీ చేయాలన్నారు. రుతుపవనాల ఆలస్యం వల్ల వర్షాలు లేక నాట్లు ఆలస్య అయ్యాయని కురుస్తున్న వర్షాల వల్ల నాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇంకా నారుమడి వేయని రైతులు ఇక వెదజల్లుకు మొగ్గు చూపాలని సూచించారు.

అందుబాటులోకి 6 పల్లె వెలుగు బస్సులు

ప్రజాశక్తి-అమలాపురం

బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం బస్ డిపోలో నూతనంగా లీజ్ పద్ధతిలో తీసుకున్న 6 అల్ట్రా పల్లె వెలుగు బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన ఆరు బస్సుల్లో 4 బస్సులు అమలాపురం నుంచి కాకినాడ మధ్యలో నడుస్తాయన్నారు. మిగతా రెండు బస్సులు అమలాపురం-రాజమహేంద్రవరం మార్గంలో నడుస్తాయని తెలిపారు. త్వరలో మరో ఆరు బస్సులు ప్రారంభిస్తామన్నారు. వర్షాకాలంలో అమలాపురం బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలుస్తున్న నేపథ్యంలో ఆర్‌టిసి బస్టాండ్ ఆధునికీకరణ చేయాలని ఎండీ.. మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకువెళ్లగా మొదటి ఫేజ్ లో రూ.కోటి 34 లక్షలకు పరిపాలన అనుమతులు లభించాయని ఈ నెలాఖరికి టెండర్లు పూర్తిచేసి ఆగస్టు నెల నుంచి ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రెండవ ఫేజ్ లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వము చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఉద్యోగులకు మేలు కలిగేలా 2020 సంవత్సరంలో ఆర్‌టిసి ప్రభుత్వ పరం చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్‌టిసి కార్మికులకు అధిక పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకున్న సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 26న సిఎం జగన్ అమలాపురం పర్యటన ఖరారైన నేపథ్యంలో సెక్యూరిటీ కారణాల వల్ల కాన్వాయ్ కి అడ్డు వచ్చే చెట్లు కొమ్మలు మాత్రమే తొలగించామని.. ఎక్కడా కూడా చెట్లను పూర్తిగా తొలగించలేదని పేర్కొన్నారు. త్వరలోనే అమలాపురం నుంచి ముఖ్యమైన ప్రాంతాలకు ఎసి స్లీపర్ బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఆర్ఎం ఆర్ విఎస్.నాగేశ్వరరావు, డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదాన నిర్వహించేందుకు అన్నదాన ట్రస్ట్ కు ఆదివారం విరాళాలు వెల్లువెత్తాయి. రాజమహేంద్రవరానికి చెందిన తెలిదేవర నాగ శ్రీవత్స రూ.1 లక్ష, సందీప్ శాంతి రూ.10 వేల.116, ఉల్లంపర్రు కి చెందిన ఎం.రఘు రాంబాబు,భాగ్యలక్ష్మి దంపతులు రూ.10 వేలు, గుంటూరుకు చెందిన పి.నాగ వెంకట మహేష్, హరిణి దంపతులు రూ.11,116, నర్సీపట్నం కి చెందిన జె.వెంకట రాజ్ కుమార్, రమ్య దంపతులు రూ.10,116, సురపు రానికి చెందిన వి.శ్రీను, మహాలక్ష్మి దంప తులు రూ.10,116, యనమలకుదురుకు చెందిన డి.రామ కిషోర్, రుక్మిణి దంపతులు రూ.10,116, కోరుమిల్లి కి చెందిన ఎం.రామారావు, లక్ష్మీపార్వతి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు వీరికి అర్చక బృందం స్వామివారి దర్శనం చేయించారు. దాతలకు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ ముదు నూరు సత్యనారాయణ రాజు స్వామివారి చిత్రపటాలను అందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

జెవివి ఆధ్వర్యంలో తీర ప్రాంతసంరక్షణపై సదస్సు

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పర్యావరణ రాష్ట్ర సదస్సు జరిగింది. మొదట తొండంగి జీవశాస్త్ర సహాయోపాధ్యాయుడు, పర్యావరణ వేత్త కెవికె.మహేశ్వరరావు 'తీరప్రాంత సంరక్షణ, అరుదైన జీవ జాతులు' అనే అంశంపై అవగాహనా ఉపన్యాసం చేశారు. తీరప్రాంత ధ్వంసం వల్ల కొన్ని జీవ జాతులు అంతమవుతున్నాయని, దీని వల్ల జీవవైవిధ్యం, పర్యావరణం దెబ్బతి ంటున్నాయని అన్నారు. జె వివి కార్యకర్తలు తీరప్రాంతం, జీవ జాతుల రక్షణకు అవగాహన కల్పించాలని మాట్లాడారు. అనంతరం బిఎస్ ఎన్ఎల్ రిటైర్డ్ సబ్ డివిజనల్ ఇంజినీర్, పర్యావరణవేత్త కె.మత్యుంజయ రావు 'అడుగంటుతున్న జలం - ప్రమాదంలో భూగోళం-తక్షణ కర్తవ్యం' అను అంశంపై మాట్లాడారు. ప్రకతి సిద్ధంగా లభించే నీరు పెరుగుతున్న జనాభాకు సరిపోదన్నారు. ఈ కారణంగా నీటిని సంరక్షించాలని, ఉప్పునీటినీ నిర్లవణీకరణ చేయాలని, కలుషిత నీటిని శుభ్రపరచి భావితరాల నీటి అవసరాన్ని తీర్చాలన్నారు. ఈ అంశాలపై జెవివి కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తే ప్రభుత్వాలను డిమాండ్ చేసి ప్రజలు మానవ భావి తరాలకు భవిష్యత్తును అందిస్తారాన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యావరణ కన్వీనర్ కెవివి. సత్యనారాయణ సారథ్యంలో జన విజ్ఞాన వేదిక కోనసీమ జిల్లా శాఖ నిర్వహించింది. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డా.చల్లా రవికుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా.స్టాలిన్, జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కృష్ణసాయి, జిల్లా కార్యదర్శి జి.స్వామి ప్రసాద్, యు.టీ.ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కేశవరావు, జిల్లా కోశాధికారి త్రినాథ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర రావు, బేతినీడి శ్రీనివాసరావు, సత్య సాయి జిల్లా రామాంజనేయులు, పశ్చిమగోదావరి జిల్లా మల్లుల శ్రీనివాసరావు, అజయ్ కుమార్, బాపట్ల జిల్లా కోట్ల వెంకటేశ్వరరెడ్డి, జిల్లా చెకుముకి కన్వీనర్ ఎన్ అబ్బులు, ముమ్మిడివరం డా.రాంప్రసాద్, అల్లవరం బి.ఎన్.శివ కుమార్, అంబాజీపేట పితాని రాంబాబు, ఐనవిల్లి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రంలో ఆదివారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన పత్రాలను అందజేశారు. సమస్యల పరిష్కార దిశగా అధికారులు ముందుకు సాగాలన్నారు. అనంతరం స్థానిక యువతకి రూ.20 వేలవ్యయంతో స్థానిక సిహెచ్‌సి ఛైర్మన్ చల్లా మునీశ్వరమ్మ కుటుంబ సభ్యులు సమకూర్చిన క్రికెట్ కిట్‌లను ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, వైసిపి గ్రామ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, నేతలు నాంద్ర నాగమోహన్ రెడ్డి, తోరాటి రాంబాబు తదిరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి పేటలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.పద్మావతి తెలిపారు. దామాషా ప్రకారం ఐదవ తరగతికి సంబంధించి 32 సీట్లు, ఇంటర్మీడియట్ సిఇసి, హెచ్ఇసిలకు 58 సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం టెన్త్ మొదటిసారి ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు.

25న కోనసీమ కుమ్మరి శాలివాహన జిల్లా సమావేశం

ప్రజాశక్తి-అంబాజీపేట

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి శాలివాహన సమావేశం మాచవరం కుమ్మరి శాలివాహన భవనం నందు ఈనెల 25న మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ ఆదివారం తెలిపింది. ప్రధాన అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశమునకు 22 మండలాల ఉన్న కుమ్మరి శాలివాహనులు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కమిటీ కోరింది.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కుడుపూరు గ్రామ మాజీ సర్పంచ్ పితాని నాగేంద్ర వెంకటరమణమూర్తి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు సంతానం ఉన్నారు. కుడుపూరు గ్రామ సర్పంచ్‌గా ఆయన 2007 నుంచి 2012 వరకు సేవలందించారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వెంకటమరణ(ఫైల్)

CHANGE OF NAME

I, SEEMAKURTY VENKATA ANNAPURNA NAGA RATNASRI, W/O, Paparao. D.no 27-6-9, Vaddadi Vari Line, Temple Street, Kakinada, As per Aadhar bearing No: 332113958391 the name was Seemakurty Venkata Annapurna Naga Ratnasri. But in my Passport Bearing No: K2759335 it was Seemakurty Venkata Annpoorna Naga Ratnasri after my marriage name with changed to Seemakurty Venkata Annapurna Naga Ratna Sri.

యానాం వార్తలు

అభ్యర్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి లక్ష్మణ ప్రవీణ్

యుడిసి పరీక్షకు 253 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా 116 యుడిసి పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలలో 2,122 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 1,869 మంది మాత్రమే హాజరయ్యారని ఎగ్జామినేషన్ రీజనల్ అధికారి, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. 253 మంది పరీక్షకు గైరాజరయ్యారన్నారు. పరీక్షా సెంటర్లలో ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు.

పూర్తిగా మునిగిపోయిన పుష్కర ఘాట్

పెరుగుతున్న వరద తీవ్రత

ప్రజాశక్తి - యానాం

యానాంలో వరద తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భారీగా వరద నీరు ధవళేశ్వరం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో వరద నీటిని భారీగా సముద్రంలోకి వదులుతున్నారు. అందువల్ల గౌతమి గోదావరి ఉధతంగా ప్రవహిస్తోంది. యానాం బీచ్ వద్ద గోదావరి వరద నీటి తాకిడి పెరిగి పుష్కర ఘాట్, పర్యాటక బోట్ హౌస్ నీట మునిగిగాయి. మత్స్యకారులను, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

చూపు కోల్పోయిన యువతికి చేయూత

ప్రజాశక్తి - యానాం

కంటి చూపు కోల్పోయిన ఒక యువతికి సావిత్రి నగర్ యువత చేయూతనిచ్చారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన అంకాడి నాగూరికి పూర్తిగా కంటిచూపు కోల్పోవడంతో సావిత్రి నగర్ యువత ఆధ్వర్యంలో యువత అధ్యక్షులు మల్లాడి రాజు ద్వారా రూ.పది వేల సాయం అందించారు. మల్లాడి రాజు మాట్లాడుతూ కేవలం సోషల్ మీడియాలో చూసి ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగాడి శ్రీనివాస్, బొమ్మిడి కామేశ్వరరావు, పాలెపు వీరబాబు, పాలెపు నాగరాజు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందిస్తున్న సత్తిబాబు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

దరియాలతిప్ప, నూకాలమ్మ గుడి సమీపంలో గుర్రం వెంకటరమణ తాటాకిల్లు, సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో పలువురు ఆదివారం సాయం అందించారు. ఆంధ్రప్రదేశ్ బిసి సేన జెఎసి జనరల్ సెక్రెటరీ మల్లాడి సత్తిబాబు తమ వంతు సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. అధికారులతో మాట్లాడి మరింత సాయం అందేలా చేస్తామని కుటుంబానికి హామీ ఇచ్చారు.

ఎంఎల్ఎ అశోక్‌తో మాట్లాడుతున్న నాయుడు

ఎంఎల్ఎ అశోక్‌కు నాయుడు పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలుకు శాస్త్ర చికిత్స చేయించుకున్న యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను రీజెన్సీ సంస్థల అధినేత జిఎన్.నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆదివారం స్థానిక గోపాల్ నగర్‌లోని ఎంఎల్ఎ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం యానాంకి సంబంధించి పలు విషయాలను చర్చించారు.

ఫ్యాషన్ డిజైన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ ట్రేడ్ లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ చింతపల్లి కష్ణ సుధాకర్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491441164 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రకటన

నా క్లయింటు తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, ఆల్కాట్ గార్డెన్స్, డో.నెం. 2-4-6/2, కాపురస్తులు ప్రస్తుత నివాసం, హైద్రాబాద్, ప్లాట్ నెం.27, 2వ అంతస్తు, ఆనంద్ నగర్ కాలనీ, న్యూబోయినపల్లి, **శ్రీ మేదూరి మహేష్, తండ్రి: లేటు సూర్యారావు** గారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేయునది. నా క్లయింటు యొక్క **ఒరిజినల్ వీలునామా నెం. 383/2002, BK-III తేదీ 26-10-2002** రిజిష్టరు కాబడిన వీలునామా ఒరిజినల్ నా క్లయింటు తన ఇంటిని రీమోడలింగ్ చేసుకొంటున్న సమయంలో పోయినది. కావున పైన తెలిపిన ఒరిజినల్ వీలునామాపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని 3 రోజులలో అభ్యంతరములు తెలుపగలరు. లేని ఎడల ఏవిధమైన అభ్యంతరములు లేని విధంగా స్వీకరించబడును.

మారెం రోశయ్య చంద్ర
మారెం శ్రీనివాసరావు
అడ్వకేట్స్, దివాన్ చెరువు, రాజమండ్రి.
సెల్: 98851 10900, 98491 79115